

జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ రాజకుమారి





స్టాల్స్‌లో మొదటి స్థానంలో నిలిచిన ఉద్యానవన శాఖ

# జిల్లాను ప్రగతిపథంలో నడిపిద్దాం

- కలెక్టర్ రాజకుమారి
- నంద్యాలలో ఘనంగా 76వ గణతంత్ర వేడుకలు
- రోల్డింగ్ షీల్డ్ అందుకున్న శాఖలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- ప్రశంసా పత్రాలు అందుకున్న అధికారులు



నంద్యాల కల్చరల్/మహానంది, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల సమష్టి కృషితో నంద్యాల జిల్లా ను ప్రగతి పథంలో నడిపిస్తామని కలెక్టర్ రాజకుమారి అన్నారు. ఆదివారం నంద్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అట్టహాసంగా 76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ చేత పతాక ఆవిష్కరణ గావించారు. అనంతరం మైదానంలో టాపులేని జీపులో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె వేదికపై మాట్లాడారు. భారత గణతంత్ర దినోత్సవం మన జాతీయ పండుగ అన్నారు. మహాత్మాగాంధీ నేతృత్వంలో ఎందరో మహానుభావులు పోరాట ఫలితంగా బానిస జీతానికి చరమ గీతం పాడి భరత మాత బానిస సంకెళ్లను ఛేదించిన అమరవీరులందరికీ నీరాజనాలు అర్పించారు. నంద్యాల జిల్లా స్వతంత్ర ఉద్యమానికి ఘన చరిత్ర కలిగి ఉందన్నారు. ఈ ప్రాంతంలో రేనాటి సూర్యచంద్రులుగా ఖ్యాతి గడించిన ఇద్దరు మహానుబావులను జిల్లా వాసులు అనునిత్యం స్మరించుకుంటారన్నారు. ఇందులో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి స్వతంత్ర ఉద్యమంలో పాల్గొని ప్రాణాలు అర్పించగా కరువు సీమలో ఈ ప్రాంత ప్రజలను ఆదుకున్న అన్నదాత బుడ్డా వెంగళరెడ్డిని మనం స్మరించుకుంటూ ఘన నివాళి అర్పించారు. నవనందుల ఆలయాలతో పాటు అనేక మసీదులు, చర్చి మందిరాలను వెలసిన ప్రాంతంగా నంద్యాల ఆంధ్ర రాష్ట్రంలోనే ఒక ప్రత్యేకత సంతరించుకుందన్నారు. మన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయాలకు అనుగుణంగా నంద్యాల జిల్లా ను సమగ్ర అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. 2024 జూన్ నుంచి ఇప్పటి వరకు ప్రజల నుంచి వచ్చిన 8216 దరఖాస్తుల్లో 7106 సమస్యల పరిష్కారం చేశామన్నారు. అలాగే రైతుల ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాలు చేసిన రెవెన్యూ సదస్సుల ద్వారా జిల్లా వ్యాప్తంగా 489 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి 3633 విజ్ఞప్తులకు గాను 1483 దరఖాస్తులను పరిష్కరించామన్నారు. నిరుపేదల కోసం అన్నా క్యాంటీనల్లను జిలలలోని అన్ని మున్సిపాలిటీలలో ఆరు క్యాంటీన్లను ప్రారంభించామన్నారు. అలాగే ఉచిత ఇసుక, లాభసాటి వ్యవసాయంతో ఉద్యానశాఖపై రైతులకు అవగాహన కల్పించి ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు పలు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ జిల్లాను ప్రగతి బాటలో ముందుకు దూసుకెళ్లేలా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, అడిషినల్ ఎస్పీ మంద జావళి ఆల్ఫోన్స్ తదితరులు పాల్గొన్నారు

**రోల్డింగ్ షీల్డులో:** జిల్లా అభివృద్ధిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పంచాయతీ రాజ్, వ్యవసాయం, స్త్రీ శిశు సంక్షేమం, కలెక్టరేట్ రెవెన్యూ, వైద్యం ఆరోగ్యం, గణాంక శాఖ, గ్రామ వార్డు సచివాలయాలు, టూరిజం శాఖలకు రోల్డింగ్ షీల్డులు ఆయా శాఖల అధికారులు కలెక్టర్, ఎస్పీ, అడిషనల్ ఎస్పీ మందజావలి ఆల్ఫోన్స్, జేసీల చేతులమీదుగా అందుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కలెక్టర్, ఎస్పీ, జేసీల చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరక్టర్ తులసిరెడ్డి, డీఆర్వో రామునాయక్, కలెక్టరేట్ ఏఓ రవికుమార్, కలెక్టర్ సిసి ప్రవీణ్‌నాయక్, కలెక్టరేట్ సెక్షన్స్ సూపరిండెంట్స్ జయప్రసాద్‌తోపాటు తహసీల్దార్లు ప్రియదర్శిని, పత్తి శ్రీనివాసులు, ఆల్‌ఫ్రెడ్, ఐసీడీఎస్ పీడీ లీలావతి, అగ్రికల్చరల్ అధికారులు నరేంద్రనాథ్ రెడ్డి, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



స్టాల్స్‌లో ద్వితీయ స్థానం సాధించిన శ్రీ శిశు సంక్షేమ శాఖ

## ఆకట్టుకున్న శకటాలు, స్టాళ్ల ప్రదర్శన

**నంద్యాల రూరల్:** ఘణతంత్ర 76వ దినోత్సవ వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఆహారాతులను ఆకట్టుకున్నాయి. ఆకర్షించేలా సుందరంగా ముస్తాభైన ఆయా శాఖలకు చెందిన 13 శకటాలు, 20 స్టాల్స్ చూపరుల మనస్సును దోచుకున్నాయి. కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ శకటాల ప్రదర్శన, స్టాల్స్ నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శకటాలు, స్టాల్స్‌లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఆయా శాఖల ఉన్నతాధికారులకు కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. శకటాల ప్రదర్శనలో ఉద్యాన శాఖ, సూక్ష్మసేద్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటం ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. శిశు సంక్షేమ శాఖకు చెందిన శకటం ద్వితీయ స్థానం, సర్వశిక్షా అభియాన్, డీఆర్‌డీఏ శకటాలు సంయుక్తంగా తృతీయ స్థానంలో నిలిచాయి. అలాగే ఆయా శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో ఉద్యాన శాఖ ప్రథమ స్థానం, శ్రీ శిశు సంక్షేమశాఖ ద్వితీయ స్థానంలో నిలవగా, డీఆర్‌డీఏ మరియు డ్వామా శాఖల స్టాల్స్ తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి.



గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్



తృతీయ స్థానం కైవసం చేసుకున్న డ్వామా స్టాల్



ఆకట్టుకుంటున్న సాంస్కృతిక ప్రదర్శనలు



## నేడు ప్రజా వినతుల స్వీకరణ

**కలెక్టర్ రాజకుమారి**

**నంద్యాల కల్చరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో ఈ నెల 27వ తేదీన సోమవారం ప్రజా ఫిర్యాధుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక్ గ్రీవియన్స్ రెడ్రస్సల్ సిస్టం (పీజీఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ఈ నెల 27వ తేదీ ఉదయం 9.30 గంటలకు జిల్లా అధికారులందరూ హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతోపాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## కోర్టుల్లో గణతంత్ర దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది

**కర్నూలు లీగల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి):** జిల్లా కోర్టుల్లో 76వ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అంతకుముందు ఆయన మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయాధికారులు పాండురంగారెడ్డి, భూపాల్ రెడ్డి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## నేను సైతం...

- సమస్యలపై సమరానికి సరైన వారధి
- ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో రేపు బృహత్తర కార్యక్రమం






సమస్యలను పరిష్కరించడంలో ప్రజా గొంతుకగా నిలిచి... అక్షర రూపంలో గళమెత్తి దమ్మున్న పత్రికగా ప్రజాభిమానం చూరగొంటున్న ఆంధ్రజ్యోతి మరో అడుగు ముందుకేసింది. ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు, అధికారులను నేరుగా ప్రజలతో మమేకమయ్యేందుకు ప్రజా వారధిని ఏర్పాటు చేసింది. సమస్యల పరిష్కారానికి స్థానిక ప్రజలకు అండగా ఆంధ్రజ్యోతి 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా' అనే మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మీ సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి మీరే తీసుకెళ్లడానికి వీలుగా కార్యక్రమం చేపట్టింది. ఎన్నో ఏళ్లుగా వెంటాడుతున్న డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధిదీపాలు, తాగునీటి వంటి సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లే అవకాశం ఆంధ్రజ్యోతి కల్పిస్తోంది. అందులో భాగంగానే మంగళవారం(రేపు) నంద్యాల పట్టణంలోని 38వ వార్డు పరిధిలో ఈ కార్యక్రమం జరగనుంది. నందమూరి నగర్‌లోని పార్కు వద్ద సమస్యల పరిష్కార వారధి జరగనుంది. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ ప్రజలు స్వచ్ఛందంగా హాజరై తమ సమస్యలను తెలియజేయవచ్చు. సాయంత్ర 4 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొంటారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలకు సిద్ధం కండి



మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

**నంద్యాల రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నూనెపల్లె నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఆహార భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల వ్యాపారులు కొనుగోలు విషయంలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ కంపెనీలు అవకాశం ఇచ్చే డిజిటల్ అగ్రిమిషన్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఉపాధి హామీలో రోజు వేతనం రూ.600 ఇవ్వాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జిల్లా అధ్యక్షులు రమేష్‌కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు యేసురత్నం, ఉపాధ్యక్షులు తోట మద్దులు, తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూరు:** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకరరెడ్డి, జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. ఆదివారం కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రిపబ్లిక్ డే సందర్భంగా స్థానిక మార్కెట్ యార్డు నుంచి నంద్యాల టర్నింగ్ వరకు ట్రాక్టర్, బైక్ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు మాబాషా, వీరన్న, సురేంద్ర ఉన్నారు.

## ఎక్సైజ్ సీఐకి రాష్ట్ర పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న నంద్యాల ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి

**నంద్యాల క్రైం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐగా విధులు నిర్వర్తిస్తున్న జి.కృష్ణమూర్తి రాష్ట్ర ఉత్తమ పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం అమరావతిలో జరిగిన 76వ గణతంత్ర దినోత్సవవేడుకల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిశాంత్‌కుమార్ చేతులమీదుగా పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది కృష్ణమూర్తిని అభినందించారు. కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర పురస్కారం మరింత బాధ్యతను పెంచిందని, విధి నిర్వహణలో తనకు సహకరించిన జిల్లా అధికారులు, సహచర బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి కృషి
ఏపీటీఎఫ్‌సీసీ వ్యవస్థాపక చైర్మన్ టీజీ వెంకటేశ్ 4

వేరుశనగ ధర పతనం 5

# అవార్డుల ప్రదానం


ప్రశంసా పత్రం అందుకుంటున్న డీపీఆర్వో జయమ్మ

ఉమ్మడి జిల్లాలో ప్రతిభ చూపిన అధికారులు, సిబ్బందికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉత్తమ అవార్డులు ప్రదానం చేశారు. కర్నూలు, నంద్యాల జిల్లా కేంద్రాల్లో ఉన్నతాధికారుల చేతుల మీదుగా ఈ అవార్డులను అందుకున్నారు. ఉన్నతాధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల్లో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు.


ప్రశంసా పత్రం అందుకుంటున్న అడిషనల్ ఎస్పీ చంద్రబాబు

## కర్నూలు జిల్లా...


ఎస్.రవీంద్రబాబు కమిషనర్ | కిలాడి సందీప్ ఆర్డీవో | మౌర్య భరద్వాజ్ సబ్ కలెక్టర్ | వెంకటేశ్వర్లు ఎస్ఎస్‌పీ | చంద్రశేఖర్‌రెడ్డి ఎస్ఐ | ఓంకార్ యాదవ్ ఎంఈఓ | శ్యామ్యూల్‌పాల్ డీఈఓ | నాగసుధ సివిల్ సప్లైస్ అధికారి
భాస్కర్ డీపీవో | వి.రామచంద్రారెడ్డి ఎస్ఈ పీఆర్ | కె.వెంకటేశ్వర్లు జీజీహెచ్ | విజయశ్రీ ఏవో | ప్రీతమ్ సీసీ | శాలిభాష సీసీ | మోహన్ ఫొటోగ్రాఫర్ | వెంకటరాజు సీసీ
చంద్రమౌళి సీసీ | లక్ష్మన నాయక్ అటెండర్ | సుధాకర్‌రావు అటెండర్ | దేవకాంత్ ఫొటోగ్రాఫర్ | ఇష్తికర్ అహ్మద్ ఫొటోగ్రాఫర్ | ఆంజనేయులు తహసీల్దార్ | రుద్రప్ప జూ.అసిస్టెంట్ | బాబుప్రసాద్ డీఎస్పీ
వెంకటరామయ్య డీఎస్పీ | శ్రీరామ్ సీఐ | నూర్జహాన్ డీఎల్‌పీవో | నగేష్ ఈవోఆర్డీ | రామాంజనేరెడ్డి ఎస్‌వో | శోభారాణి ఎంపీడీవో | నాగోశాచలరెడ్డి ఎంపీడీవో | రామచంద్రమూర్తి సీ.అసిస్టెంట్

## నంద్యాల జిల్లా...


శ్రీనివాస్ డోన్ డీఎస్పీ | రామాంజినాయక్ ఆత్మకూరు డీఎస్పీ | మోహన్‌రెడ్డి స్పెషల్‌బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ | సుధాకర్‌రెడ్డి వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ | కృష్ణయ్య, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ | సురేష్ కుమార్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ | రాము ఆత్మకూరు ఎస్ఐ | నగీన, ఆళ్లగడ్డ టౌన్ ఎస్ఐ
సుబ్బారెడ్డి ఏఎస్ఐ | మమత డోన్ ఎస్ఐ | దస్తగిరి కానిస్టేబుల్ | గురుప్రసాద్ కానిస్టేబుల్ | బాషా ఏఎస్ఐ | సురేష్ ఎస్ఐ | శివకుమారి కానిస్టేబుల్ | జగన్‌మోహన్ బండిఆత్మకూరు ఎస్ఐ
కళ్యాణి జూ.అ. | షరీఫ్ డీఆర్‌డీఏ | పెంచలయ్య సీఎల్‌టీసీ | సరోజ మెప్మా | కల్పన జూ.అ. | శ్రీనివాసులు డీఈఈ | రవీంద్రారెడి డీఈఈ | ఎస్‌సీఈ మద్దన్న ఈఈ
శేషయ్య డీఈఈ | హనుమంతరెడ్డి ఏఈ | హరిబాబు ఆర్‌డబ్ల్యూఎస్ | రెహనాబేగమ్ ఎక్సైజ్ ఎస్ఐ | శ్రీకాంత్ ఐఅండ్‌పీఆర్ | వీరభద్రుడు ఐఅండ్‌పీఆర్ | ఎరుకల రాజు ఎన్‌జీజీ | అవినాష్ శెట్టి క్రీడలు

## సనాతన ధర్మమే భారతీయుల మనోధైర్యం


పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

**నంద్యాల కల్చరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** సనాతన ధర్మమే భారతీయుల మనోధైర్యమని యడవల్లి కార్తికేయశర్మ అన్నారు. నంద్యాల సంజీవనగర్ కోదండ రామాలయంలో ఐదు రోజులపాటు మహా సుదర్శన యాగం భగవత్ సేవా సమాజ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, ప్రధాన కార్యదర్శి వంకదారి మధుసూదన్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో 21 హోమాలు 300 మంది దంపతుల చేత ఈ మహాయజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం వేద మంత్రాలతో అర్చకులు పూర్ణాహుతి నిర్వహించారు. ఆదివారం ముగింపు కార్యక్రమానికి నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దేవరశెట్టి శ్రీనివాస్, పార్థసారథి క్రిష్ణ, భక్తులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఎస్ఈకి ఉత్తమ అవార్డు


బెస్ట్ అవార్డు అందుకుంటున్న ఎస్ఈ

**కల్లూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** విద్యుత్ శాఖ కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎం.ఉమాపతి బెస్ట్ అవార్డు అందుకున్నారు. ఆదివారం తిరుపతి కార్పొరేట్ ఆఫీసులో దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సం తోషరావు అవార్డు ప్రదానం చేశారు. ఈమేరకు విద్యుత్‌శాఖ కర్నూలు సర్కిల్ అన్ని పారామీటర్లలో లక్ష్యాలను సాధించి అత్యున్నత స్థానంలో నిలవడంతో ఈ పురస్కారం దక్కింది. 2023, 24 సంవత్సరంలో వరుసగా కర్నూలు సర్కిల్ ఈ అవార్డును అందుకోవడం పట్ల ఎస్ఈ ఎం.ఉమాపతి సంతోషం వ్యక్తం చేశారు. మరింత ఉత్సాహంతో సంస్థకు, కర్నూలు సర్కిల్ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## శ్రీశైలంలో స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవ

**శ్రీశైలం(ఆత్మకూరు), జనవరి 26(ఆంధ్రజ్యోతి):** శ్రీశైల క్షేత్రంలో మూలా నక్షత్రం, ఆదివారాన్ని పురస్కరించుకుని భ్రమరాంబ మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు పల్లకిసేవ నిర్వహించారు. కాగా ప్రతి ఆదివారం, పౌర్ణమి, మూలా నక్షత్రం సందర్భంగా దేవస్థానం తరపున ఈ సేవను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో లోకకళ్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించారు. ఆతర్వాత మహాగణపతి పూజ అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకి అశీనులను చేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# జిల్లాలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి కృషి

● ఏపీటీఎఫ్‌సీసీ వ్యవస్థాపక ఛైర్మన్ టీజీ వెంకటేశ్

**కర్నూలు, రాజ్‌విహార్ సర్కిల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి):** జిల్లాలో చిత్ర పరిశ్రమకు అనువైన భూములు, వనరులు, అద్భుతమైన కట్టడాలు అందుబాటులో ఉన్నాయని, ఇక్కడి సదుపాయాలు, పరిస్థితులను సద్వినియోగం చేసుకుని చిత్ర పరిశ్రమ ఇక్కడ షూటింగ్‌లు చేసుకోవడానికి ఆహ్వానిస్తున్నట్లు ఏపీ తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఏపీటీఎఫ్‌సీసీ) వ్యవస్థాపక ఛైర్మన్ టీజీ వెంకటేశ్ తెలిపారు. కర్నూలు నగరంలోని పరిణయ వేడుక భవనంలో ఆదివారం సంస్థ తొలి సమావేశం ఏర్పాటు చేశారు. టీజీ మాట్లాడుతూ దశాబ్దాల క్రితం మద్రాసులో చిత్రపరిశ్రమ అభివృద్ధి చెందటానికి రాయలసీమ వాసులైన నాగిరెడ్డి, చక్రపాణి వంటి ప్రముఖుల కృషి ఎంతో ఉందన్నారు. మద్రాసు నుంచి హైదరాబాద్‌కు చిత్ర పరిశ్రమ తరలింపులో ప్రముఖ నటులు ఎన్టీఆర్, ఏఎన్నార్‌ల సహకారం మరువలేనిది అని అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర విభజన తరువాత చిత్రపరిశ్రమ హైదరాబాద్‌కు పరిమితం కావటంతో ఏపీకి చిత్ర పరిశ్రమ అవశ్యకత కోసం గళం విప్పేందుకు ఏపీటీఎఫ్‌సీసీ లాంటి వేదిక ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. కర్నూలు చిత్ర షూటింగ్ వల్ల ఇక్కడి కళాకారుల పోషణతో పాటు స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో సంస్థను మరింత బలోపేతం చేస్తామని, పలు రంగాలకు చెందిన ప్రముఖుల సహకారంతో సంస్థ విశ్వసనీయత దెబ్బతినకుండా మార్పు, చేర్పులతో పునర్నిర్మాణం చేస్తామన్నారు. ఏపీఎఫ్‌సీసీ మాజీ అధ్యక్షుడు, ఏపీఎఫ్‌టీసీసీ వ్యవస్థాపక సలహాదారు బీవీ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత ఈ సంస్థ ఏర్పాటుకు టీజీ వెంకటేశ్ ఎంతో చొరవ చూపారని, శ్రీశైలం లాంటి పుణ్యక్షేత్రాలతో పాటు పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాలు సినిమా చిత్రీకరణకు ఎంతో అనువుగా ఉంటాయని చెప్పారు. ఏపీ తెలంగాణతో పాటు కర్ణాటక వాసులకు కర్నూలు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. విజయవాడకు మించిన ప్రదేశాలు ఇక్కడ ఉన్నాయని, ఏపీటీఎఫ్‌సీసీ వల్ల సినీ రంగం వృద్ధి చెందుతోందని, దర్శకులు, నిర్మాతలు, నటులు ఇక్కడ నుంచి తయారు అవుతారని బీవీ రెడ్డి అన్నారు. దీని వల్ల స్థానికంగా అభివృద్ధి చెందుతోందన్నారు. విద్యావేత్త కేవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ సినిమా ప్రభావం ప్రజలపై ఎంతో ఉంటుందన్నారు. సీమ ప్రాంతానికి చెందిన ఎందరో మహనుభావులు గొప్ప సినిమాలు తీశారని, టీజీ వెంకటేశ్ సహకారం ఉంటే ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాలు సైతం సులువులగా సాధించవచ్చునని తెలిపారు. ప్రముఖ బిల్డర్ కేజే రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో సినిమా షూటింగ్ చాలా మందికి సెంటిమెంట్‌గా ఉందని, దర్శక, నిర్మాతలు నటులు ఈ ప్రాంతాన్ని సందర్శించాలని కోరారు. కర్నూలు అనేది గేట్‌వే ఆఫ్ సౌత్ అని, ఇక్కడ సినిమాలు తీస్తే స్థానికంగా ఉంటే పారిశ్రామికవేత్తలు, పెద్దలు సహకరిస్తానరని తెలిపారు. ఏపీటీఎఫ్‌సీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దర్శకుడు, ప్రొడ్యూసర్ కరణ్, పత్తి ఓబులయ్య, మహ్మద్‌మియా, కస్తూరి చంద్రశేఖర్, దాశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏపీటీఎఫ్‌సీసీ వ్యవస్థాపక ఛైర్మన్ టీజీ వెంకటేశ్

## శ్రీశైల క్షేత్రాభివృద్ధికి మరిన్ని ప్రతిపాదనలు

గణతంత్ర వేడుకల్లో వెల్లడించిన ఈవో

**శ్రీశైలం(ఆత్మకూరు), జనవరి 26(ఆంధ్రజ్యోతి):** శ్రీశైల క్షేత్రాభివృద్ధికి మరిన్ని ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం 76వ గణతంత్య దినోత్సవం స్థానిక దేవస్థానం పరిధిలోని పరిపాలన కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఈవో శ్రీనివాసరావు మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆ తర్వాత జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఏడాదిలో శ్రీశైల క్షేత్రానికి దేవస్థానం అనేక చర్యలు చేపట్టిన్నట్లు తెలిపారు. వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపట్టడంతో భక్తులకు సదుపాయాలను మెరుగుపర్చినట్లు చెప్పారు. సంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగంలో భాగంగా రూ.35 కోట్లతో ఏడు మెగా వాట్ సోలార్ ప్లాంట్‌ను నిర్మించాలని దేవస్థానం భావిస్తున్నట్లు తెలిపారు. దీని వల్ల ప్రతిరోజూ 31వేల యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే అవకాశం ఉందన్నారు. దీని వల్ల ఏడాదికి రూ.7 కోట్ల మేర విద్యుత్ ఖర్చు ఆదా అవుతుందన్నారు. అదే క్రమంలో మల్లమ్మ కన్నీరు, హటకేశ్వరం, ఫిల్టర్‌బెడ్ తదితర చోట్ల రూ.6.2 కోట్లతో తాగునీటి ట్యాంకులు, అమ్మవారి ఆలయంలోని ఉత్తర సాలుమండపాలను రూ.99 లక్షలతో పునర్నిర్మాణం చేయనున్నట్లు చెప్పారు. పంచమఠాల చుట్టూ రూ.86 లక్షలతో కంచె నిర్మాణాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలో రూ.70 లక్షల వ్యయంతో అలంకార మండపాన్ని నూతనంగా నిర్మించడంతోపాటు రూ.60 లక్షల వ్యయంతో ఆగమ పాఠశాల అభివృద్ధికి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. అలాగే గణేశ సదనం ఎదురుగా మినీ కళ్యాణకట్టను నిర్మిస్తున్నామని వెల్లడించారు. స్వర్ణరథాన్ని భక్తులు వీక్షించేందుకు వీలుగా రథం షెడ్డును నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే దోర్నాలలోని దేవస్థాన సత్రంలో కళ్యాణ మండపాన్ని నిర్మిస్తామన్నారు. ఇవేకాక శ్రీశైలాన్ని మరింత ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. కాగా ఈ వేడుకల్లో విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి.


శ్రీశైలంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఈవో శ్రీనివాసరావు

## ఘనంగా వాసవీమాత పుష్ప యాగ మహోత్సవం


వాసవీమాతకు పుష్పయాగ మహోత్సవం

**నంద్యాల కల్చరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల మెయిన్‌బజార్‌లో వెలసిన వాసవీ కన్యక పరమేశ్వరి అమ్మవారికి ఘనంగా మహా పుష్ప యాగ మహోత్సవం నిర్వహించారు. ఆదివారం వాసవీ దీక్షామండలి అధ్యక్షులు యినుగూరి రమేష్ బాబు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అర్చకులు భక్తిశ్రద్ధలతో అభిషేకార్చనలు జరిపారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తులకు వైభవంగా మహాపుష్పయాగం చేశారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం, దీపోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవీమహిళామండలి సభ్యులు, వాసవీ మాత దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ శాఖకు రోలింగ్ షీల్డ్


కలెక్టర్ నుంచి రోలింగ్ షీల్డ్‌ను అందుకుంటున్న ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి రవికుమార్

**నంద్యాల క్రైం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖకు ప్రతిష్టాత్మకమైన కలెక్టర్ రోలింగ్ షీల్డ్ పురస్కారం లభించింది. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆదివారం నంద్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెరేడ్ మైదానంలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ రాజకుమారి గనియా పురస్కారాన్ని జిల్లా ఎక్సైజ్ అధికారి రవికుమార్‌కు అందజేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీ అమలులో విశేష కృషి చేసిన నంద్యాల జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ బృందానికి ఈ పురస్కారాన్ని కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అందించి అభినందించారు. మునుపెన్నడూ ఎక్సైజ్ శాఖకు ప్రతిష్టాత్మక ఈ పురస్కారం లభించలేదని, ఈ ఏడాది ప్రతిష్టాత్మకమైన కలెక్టర్ రోలింగ్ షీల్డ్ లభించడం ఆనందంగా ఉందని జిల్లా ఎక్సైజ్ అధికారి రవికుమార్ తెలిపారు.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


శ్రీశైలంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

**శ్రీశైలం(ఆత్మకూరు), జనవరి 26(ఆంధ్రజ్యోతి):** శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా దక్షిణ మాఢ వీధిలోని నిత్యాకళారాధన వేదికపై ఆదివారం హైదరాబాద్‌కు చెందిన శ్రీస్వప్న నృత్యాలయ వారిచే నిర్వహించిన సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం భక్తులను ఎంతగానో అలరించింది. ఇందులో భాగంగా గణపతి ప్రార్థన, హరహర శంకర, నమఃశివాయతే, శివతాండవ స్తోత్రం, నాగేంద్రహారయ తదితర గీతాలకు, అష్టకావాలకు శ్రీహర్షిత, గౌతమ్, రుద్రప్రియ, చిన్మయి, నిఖిల, గోవిందమ్మ, సాత్విక తదితరులు నృత్య ప్రదర్శనలు చేశారు. కాగా స్వామిఅమ్మవార్ల కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని, ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా నిత్య కళారాధనలో భాగంగా ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

## శాశ్వత నిత్యాన్నదాన పథకానికి విరాళం

**శ్రీశైలం(ఆత్మకూరు), జనవరి 26(ఆంధ్రజ్యోతి):** శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన నందిగం రంజిత్‌కుమార్ అనే భక్తుడు ఆదివారం రూ.1,01,100 విరాళం అందజేశారు. ఈ మేరకు సంబంధిత విరాళ సొమ్మును దేవస్థానం ఏఈవో స్వాములుకు అందజేశారు. అదేవిధంగా రాజమండ్రికి చెందిన సూర్యప్రకాశరావు అనే భక్తుడు ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.1,00,116 విరాళం అందజేశారు.

# ఆంధ్రజ్యోతి కార్యాలయంలో గణతంత్ర వేడుకలు




గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న ఆంధ్రజ్యోతి సిబ్బంది

**కర్నూలు (కల్చరల్), జనవరి 26(ఆంధ్రజ్యోతి):** నగర శివారులోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కార్యాలయ ఆవరణలో బ్రాంచ్ మేనేజర్ ఎ.లక్ష్మణ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణతంత్ర వేడుకల ప్రత్యేకత గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎడిషన్ ఇన్‌చార్జి చల్లా నవీన్‌కుమార్ నాయుడు, బ్యూరో ఇన్‌చార్జి గోరంట్ల కొండప్ప, యూనిట్ సర్క్యులేషన్ మేనేజర్ సోమశేఖర్‌రెడ్డి, యాడ్స్ మేనేజర్ గోపాల్, ఇతర విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాయి హైమావతికి ప్రశంసా పత్రం



కలెక్టర్ రంజిత్‌బాషా నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న ఇరిగేషన్ సీఈ ఆఫీసు సీనియర్ అసిస్టెంట్ సాయి హైమావతి

**కర్నూలు, జనవరి 26(కర్నూలు):** జలవనరుల శాఖ కర్నూలు ప్రాజెక్ట్ సీఈ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ ఎం. సాయిహైమా వతి ఆదివారం కలెక్టర్ పి.రంజిత్‌బాషా చేతులు మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఎస్ఆర్‌బీసీ క్వాలిటీ కంట్రోల్ డివిజన్-1లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ 2022 డిసెంబరు 9న సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. సీఈ ఆఫీసులో విధులు నిర్వర్తి స్తున్నారు. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఈమే సేవలను గుర్తించి ఈసీ కబీర్‌బాషా సిఫారసు మేరకు ప్రశంసా పత్రం అందజేశారు.

## బుట్టా ఫౌండేషన్‌కు...

● వలంటీర్లకు సన్మానం



బుట్టా ఫౌండేషన్ వలంటీర్లతో కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్

**కర్నూలు హాస్పిటల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి):** గణతంత్ర వేడుకల సందర్భంగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు విశేష సేవలు అందిస్తున్న బుట్టా ఫౌండేషన్ వలంటీర్లను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ఏడు జిల్లాల నుంచి వచ్చే రోగులకు వివరాలు తెలియజేయడం, వారిని అత్యవసర విభాగాలకు తీసుకుని వెళ్లడం, రోగులకు సహాయాకారిగా వలంటీర్లు పని చేస్తున్నారని ప్రశంసించారు. బుట్టా ఫౌండేషన్ వలంటీర్ల బృందం నాగజ్యోతి, రహిమాన్, ఇతర సభ్యులను సూపరింటెండెంట్ అభినందించారు. ఆసుపత్రి సేవల్లో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని, బుట్టా ఫౌండేషన్ స్థాపకులు బుట్ట శివనీలకంఠం, బుట్ట రేణుక ఆశయాలకు అనుగుణంగా వలంటీర్లు పని చేస్తున్నారని అన్నారు.

● కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆసుపత్రిలో ఓపీ.333 వెల్‌నెస్ క్లీనిక్‌ను ప్రారంభించామని, త్వరలో పెయింగ్ బ్లాకు గదులు రోగులకు అందుబాటులో తెస్తామని సూపరింటెండెంట్ తెలిపారు. డాక్టర్ చక్రవర్తి (సర్జరీ), డాక్టర్ కుముద (గైనిక్), డాక్టర్ పుండరీకాంక్షయ్య (న్యూరోసర్జరీ) ఇతర సిబ్బంది, సూపరింటెండెంట్ ప్రశంసాపత్రాలను అందించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డా.శ్రీరాములు, సీఎస్ఆర్ఎంవో డా.బీవీ రావు, ఆసుపత్రి ఏడీ రమేష్‌బాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రీబాయి పాల్గొన్నారు.

**కర్నూలు కల్చరల్ :** గణతంత్ర వేడుకల్లో భాగంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ కలెక్టర్ రంజిత్ కుమార్ నుంచి ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్నారు.





కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్, ఆస్పత్రి సూపరింటెండెంట్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న అనస్థీషియా టెక్నీషియన్ దినేష్

## గీతాంజలి నర్సింగ్ కాలేజీలో గణతంత్ర వేడుకలు

**కర్నూలు హస్పిటల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లోని గీతాంజలి నర్సింగ్ కాలేజీలో 76వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల కరస్పాండెంట్ పెరుగు విజయవర్ధన్ రెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వసంతకుమారి, అధ్యాపకులు సురేఖ, నిర్మల, సంధ్యారాణి పాల్గొన్నారు. అనం తరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న పెరుగు విజయవర్ధన్ రెడ్డి

## కర్నూలు కళాకారులకు అవకాశం కల్పిస్తాం



టీజీవీ కళాక్షేత్రంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పత్తి ఓబులయ్య, కళాకారులు

**కర్నూలు కల్చరల్, జనవరి 26(ఆంధ్రజ్యోతి):** కర్నూలు జిల్లా కళాకారులకు వేదికగా టీజీవీ కళాక్షేత్రాన్ని మారుస్తామని అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. ఆదివారం రాత్రి గణతంత్ర దినోత్సవం సందర్భంగా కళాక్షేత్రంలో సాయంత్రం నుంచి రాత్రి దాకా దేశభక్తి గీతాలకు నృత్య కార్యక్రమాలను నిర్వహించారు. కర్నూలు నాట్య గురువుల శిష్య బృందం దేశభక్తి గీతాలకు సాంస్కృతిక నృత్య ప్రదర్శన చేసి అలరించారు. ఇందులో రోహిత్ తేజ, నారాయణస్వామి, కరీముల్లా, సాయిప్రదీప్ శిష్యబృందం చిన్నారుల దేశభక్తి నృత్యాలను చేశారు. శివలీల, వాణి, సాయి చేసిన జయదేవుని అష్ట గీతాలు అందరిని ఆకట్టుకున్నాయి. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలనలో సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, కళాక్షేత్రం కార్యదర్శి మహ్మద్ మియా, ఉపాధ్యక్షులు రాజా రత్నం, కన్వీనర్లు ఈ.పాండురంగయ్య, చంద్రకంటి మద్దయ్య, గాండ్ల లక్ష్మన్న పాల్గొన్నారు.

# వేరుశనగ ధర పతనం



- కనీస మద్దతుకు నోచుకోని రైతులు
- తూకాల్లో మోసం జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- కర్నూలు మార్కెట్ యార్డులో దుస్థితి

**ఈ రైతు పేరు మారెన్న. క్రిష్ణగిరి మండలం. గ్రామంలో తనకున్న ఐదెకరాల పొలంలో దాదాపు రూ.లక్ష ఖర్చు పెట్టి వేరుశనగ సాగు చేశాడు. అయితే.. క్రిమికీటకాలు, తెగుళ్లు వ్యాపించి ఎకరాకు 4 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. కనీసం ఈ పంటకైనా మద్దతు ధర లభిస్తుందేమోనని ఆశతో శనివారం కర్నూలు మార్కెట్ యార్డుకు అమ్మకానికి తీసుకువచ్చారు. వ్యాపారులు సిండికేటుగా మారడంతో ఈ రైతు ఆశించిన ధర దక్కలేదు. రూ.4,802 మాత్రమే దక్కింది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.6,780 దక్కకపోవడంతో రైతు ఉసూరుమంటూ వెనుదిరిగి వెళ్లిపోయాడు.**

**కర్నూలు అగ్రికల్చర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేరుశనగ పంట సాగు చేసిన రైతులందరిదీ ఇదే పరిస్థితి. కర్నూలు మార్కెట్ యార్డులో శనివారం 654 క్వింటాళ్ల వేరుశనగ కాయలు అమ్మకానికి వస్తే గరిష్ఠంగా ఐదారు మంది రైతులకు మాత్రం గరిష్ఠ ధర 6,109, మధ్యస్థ ధర రూ.4,802, కనిష్ఠ ధర రూ.4,099 మాత్రమే దక్కింది. ఈ సంవత్సరం ఉమ్మడి కర్నూలు జిల్లాలో డోన్, పాణ్యం, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆలూరు ఆదోని నియోజకవర్గాల్లో దాదాపు లక్షన్నర హెక్టార్లలో వేరుశనగ సాగైంది. విత్తనం వేసే సమయంలో ప్రభుత్వం నుంచి క్వింటం వేరుశనగ విత్తనాలకు రూ.9,300 చెల్లించి కొన్నారు. ఇందులో 40 శాతం ప్రభుత్వం రాయితీగా అందించింది. తాము కొన్నప్పుడు వ్యాపారులు క్వింటానికి రూ.9,300 దండుకున్నారని, ధరను ప్రభుత్వమే చెల్లిట్లచిందని, మరి తాము అమ్మకానికి తెచ్చినప్పుడు కనీసం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.6,780 అయినా వ్యాపారుల నుంచి అధికారులు ఎందుకు ఇప్పించలేకపోతున్నారని, ఇదే పరిస్థితి మిగిలిన పంటలు సాగు చేసిన రైతులందరూ మార్కెట్ కమిటీ యార్డుల్లో ప్రశ్నిస్తున్నారు. ఆముదాలకు గరిష్ఠ ధర రూ.5,616, మధ్యస్థ ధర రూ.5,569, కనిష్ఠ ధర రూ.5,350 మాత్రమే దక్కింది. మొక్కజొన్నలకు గరిష్ఠ ధర రూ.2,369, మధ్యస్థ ధర రూ.2,369, కనిష్ఠ ధర రూ.2,000 మాత్రమే దక్కింది.

వారం కింద కందులకు 7,500 గరిష్ఠ ధర అందగా.. శనివారం గరిష్ఠంగా రూ.7,166, మధ్యస్థ ధర రూ.7,009, కనిష్ఠ ధర రూ.4,196 దక్కింది. శనగలకు గరిష్ఠ ధర రూ.5,956, మధ్యస్థ ధర రూ.5,569, కనిష్ఠ ధర రూ.5,009 మాత్రమే అందడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. ఉల్లిగడ్డలకు గరిష్ఠ ధర కేవలం రూ.2,459, మధ్యస్థ ధర రూ.2,269, కనిష్ఠ ధర రూ.787 దక్కింది. కేవలం అమ్మకానికి 798 క్వింటాళ్లు మాత్రమే వచ్చినా ధర పూర్తిగా పతనం కావడంపై రైతులు ఆక్రోశిస్తున్నారు. ఎండుమిరపకాయలకు గత సంవత్సరం క్వింటంపై గరిష్ఠంగా రూ.20వేలు దక్కితే.. ఈసారి కనీసం రూ.14వేలు చేతికంద డంపై రైతులు లబోదిబోమంటున్నారు. మధ్యస్థ ధర రూ.12,629, కనిష్ఠ ధర రూ.4,499 మాత్రమే దక్కింది. అమ్మకానికి తెచ్చిన పంట ఉత్పత్తులకు తక్కువ ధర ఇవ్వడమేగాక తూకాల విషయంలో అన్యాయం జరుగుతున్నా అధికారులు శ్రద్ధ తీసుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. మార్కెట్‌యార్డు అధికారులు, సెక్యూరిటీ గార్డులు కార్యాలయాల్లో పిచ్చాపాటితో కాలక్షేపం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## జాతీయ జెండా ఎగరని కార్యాలయాలు



జెండా ఎగరని సబ్ ట్రెజరీ కార్యాలయం



రోడ్లు, భవనాల శాఖ కార్యాలయం



గృహ నిర్మాణ శాఖ కార్యాలయం



జాతీయ జెండా ఎగరని ఉపాధి కార్యాలయం

**నందికొట్కూరు రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలో కొన్ని ప్రభుత్వ కార్యాలయాల ముందు 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేయలేదు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న సబ్ ట్రెజరీ కార్యాలయం, గృహనిర్మాణ కార్యాలయం, రోడ్లు భవనాల శాఖ కార్యాలయం, జాతీయ ఉపాధి హామీపథకం కార్యాలయం వద్ద గణతంత్ర వేడుకలను నిర్వహించలేదు. ప్రతి కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేయాలని ప్రభుత్వం ఆదేశించినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై అధికారులను వివరణ కోరగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

**కర్నూలు క్రైం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** పోలీసు కానిస్టేబుళ్ల దేహదారుఢ్య సామర్ధ పరీక్షల బందోబస్తు విధుల్లో పోలీసు అధికారులు ఉన్న కారణంగా సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు విషయాన్ని గమనించి కార్యక్రమానికి రావద్దని ఆయన తెలిపారు.

## కిడ్నీ ఇప్పిస్తానని రూ.3 లక్షలు వసూలు

● సోషల్ మీడియాలో వైరల్

**కర్నూలు హస్పిటల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** కిడ్నీ ఇప్పిస్తానని ఓ వ్యక్తి రూ.3 లక్షలు వసూలు చేశాడంటూ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కర్నూలు జీజీహెచ్‌లో 2022-24 బ్యాచ్‌కు చెందిన అనస్థీషియా టెక్నీషియన్ చేసే ఓ విద్యార్థి ఈ తతంగం నడిపినట్లు తెలుస్తోంది. రోగులకు మాయమాటలు చెప్పి రూ.3 లక్షలు వసూలు చేశాడని సమాచారం. మోసపోయామని తెలుసుకున్న బాధితులు డబ్బులు ఇవ్వాలని పది రోజులుగా అడుగుతున్నా పట్టించుకోవడం లేదని తెలిసింది. ఇదే విషయమై విద్యార్థి ఫొటోతో సహా ఉన్న ఓ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. తమకు సహాయం చేయాలని రోగులను రక్షించాలని సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

## చిన్న కోతతోనే గుండె ఆపరేషన్లు



జ్ఞాపిక అందున్న డా.సి.ప్రభాకర్ రెడ్డి

**కర్నూలు హస్పిటల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** వైద్యుల నైపుణ్యంతో చిన్న కోత ద్వారా గుండె ఆపరేషన్లు చేయవచ్చని కర్నూలు జీజీహెచ్‌కు చెందిన సీనియర్ కార్డియోథొరాసిక్ సర్జన్ డా.సి.ప్రభాకర్ రెడ్డి అన్నారు. విశాఖపట్నంలో ఈ నెల 25, 26 తేదీల్లో ఏపీ గుండె శస్త్ర చికిత్స నిపుణుల రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సులో సీటీ సర్జన్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి చిన్న కోతతో గుండె ఆపరేషన్లు అన్న అంశంపై మాట్లాడారు. చిన్న కోత ఆపరేషన్లు చాలా ఖరీదన్న అపోహ చాలా మందిలో ఉందన్నారు. ఈ ఆపరేషన్లు చౌకగా చేయవచ్చని, ఉచితంగా ప్రభుత్వాసుపత్రిలో చేస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా నూతన వైద్యులకు ఎంఐసీఎస్ పద్ధతిలో సులభంగా ఆపరేషన్లు చేయడానికి కావాల్సిన మెలకువలను వివరించారు. కొంత నైపుణ్యం సంపాదిస్తే ఓపెన్ ఆపరేషన్ కంటే తక్కువ సమయంలో చేయవచ్చన్నారు. దీని వల్ల రోగికి ఎంతో మేలు జరుగుతుందని, రక్తం పోకుం డా, ఇన్‌ఫెక్షన్లు తక్కువగా ఉండటం, తొందరగా డిశ్చార్జ్ కావడం, రోగి త్వరగా కోలుకుని పనికి వెళ్లడం అన్న అంశాలు, అనుభవాలపై ఆయన వైద్యులతో చర్చించారు. కర్నూలు జీజీహెచ్‌లో డీవీఆర్ డబుల్ వాల్వు ఆపరేషన్లు, చిన్న కోత ఆపరేషన్లు చేస్తున్నారని చెప్పడంతో వైద్యులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

**జూపాడుబంగ్లా, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని తంగడంచ గ్రామానికి చెందిన కౌలురైతు మస్తాన్ అలియాస్ మనోహర్(42)చికిత్స పొందుతూ మృతి చెందాడు. రెండు ఎకరాలు సొంత పొలంతోపాటు నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని పొగాకు, మినుము సాగు చేసేవాడు. పొగాకుకు ధర లేకపోవడంతోపాటు తెగుళ్లతో మినుము పంట దెబ్బతిని ఏడాదికే అప్పులు పెరిగిపోయాయి. సుమారు రూ.8 లక్షల వరకు అప్పులయ్యాయి. వీటిని తీర్చే మార్గం కనిపించక నెల 13వ తేదీ పొలం వద్దే పురుగుల మందు తాగాడు. ఇరుగు పొరుగు రైతులు గమనించి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. డి ఫౌండేషన్ సంస్థ చైర్మన్ దినేష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసహాయం అందించారు.

## మద్యం స్వాధీనం

**కొత్తపల్లి జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని శివపురం గ్రామంలో అక్రమ మద్యం కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆత్మకూరు ఎక్సైజ్ సీఐ కిషోర్ కుమార్ తెలిపారు. గ్రామంలో ముగ్గురు వ్యక్తుల నుంచి 63 మద్యం బాటిళ్లు అక్రమంగా కలిగి ఉండి విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు దాడులు నిర్వహించి 63 మద్యం క్వాటర్ బాటిళ్లను స్వాదీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు వీరస్వామి, జగదీష్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



టీజీవీ కళాక్షేత్రంలో పోతుగడ్డ చిత్ర యూనిట్

## ప్రేమకథా చిత్రం 'పోతుగడ్డ'

**కర్నూలు కల్చరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** 24 సినిమా స్ట్రీట్ ప్రొడక్షన్‌లో నిర్మించిన ఫ్యాక్షన్ ప్రేమకథా చిత్రం పోతుగడ్డ అని చిత్ర యూనిట్ సభ్యులు అన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సినిమాకు మాటల రచయితగా పరిచయమైన కవి కెంగార మోహన్ మాట్లాడుతూ పరువు గొప్పదా.. ప్రేమ గొప్పదా అన్న నేపథ్యంలో సినిమా సాగుతుందన్నారు. కళాకారులను కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య సత్కరించారు. దర్శకుడు రక్షవీరం మాట్లాడుతూ వైవిధ్యభరిత కథతో సినిమా తీశామన్నారు. ప్రేక్షక ఆదరణ పొందుతుందన్న నమ్మకం కలుగుతుందన్నారు. హీరో హీరోయిన్లు పృథ్వి దండమూడి, విస్మయశ్రీలు మాట్లాడుతూ చిత్రం ఆదరించి ప్రోత్సహించాలన్నారు. ఇప్పటికే చిత్రం ట్రైలర్ సంచలనం సృష్టించిందన్నారు. తారాగణం అధుకలం నరేన్, శత్రు, ప్రశాంత్ కార్తీ, వెంకి లింగం పాల్గొన్నారు. ఈ సినిమా ఈ నెల 30న ఈటీవీ విన్ ఓటీటీలో విడుదల కానుందని అసోసియేట్ ఎడిటర్ అశ్వర్థరాం తెలిపారు .అనంతరం పోతుగడ్డ సినిమా బృందం టీజీవీ కళాక్షేత్రం విచ్చేసిన సందర్భంగా ఆదివారం రాత్రి టీజీవీ కళాక్షేత్రంలో కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య సత్కరించారు. కళాక్షేత్రం చైర్మన్ టీజీ వెంకటేశ్ కళాకారులకు ఇస్తున్న ప్రోత్సాహకాలను సినిమా బృందం అభినందించింది.

## యువకుడి ఆచూకీ లభ్యం



అపస్మారక స్థితిలో ఉన్న నిరంజన్

**ఆత్మకూరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** ఆత్మకూరు ప్రాంతంలో సంచలనం రేకెత్తించిన యువకుడి అదృశ్యం కథ సుఖాంతమైంది. చిన్నపాటి ఆధారాలతో పోలీసులు ఆ యువకుడిని గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూరు పట్టణంలోని తిక్కయ్యస్వామి దర్గా సమీపంలో నివాసం ఉంటున్న ఆర్టీసీ డ్రైవర్ మహెబూబ్‌బాషా కుమారుడైన నిరంజన్ బెట్టింగ్ యాప్స్ జోలికెళ్లి రూ.13 లక్షల వరకు నష్టపోయాడు. చేసిన అప్పులను ఎలా చెల్లించాలో దిక్కుతోచగా ఈ నెల 24న సూసైడ్ లెటర్ రాసి ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. దీంతో ఆయువకుడి కుటుంబీకులు పోలీసులను ఆశ్రయించారు. ఆత్మకూరు అర్బన్ సీఐ రాము ఐదు బృందాలను ఏర్పాటు చేసి యువకుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం మధ్యాహ్నం నిరంజన్ భార్యకు ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. నిరంజన్ నీరసించి అస్వస్థతకు గురయ్యాడని సమాచారం ఇచ్చి ఫోన్ పెట్టేశాడు. ఆ తర్వాత ఆ నంబర్ పని చేయకపోవడంతో యువకుడి కుటుంబీలు పోలీసులకు తెలిపారు. దీంతో అప్రమత్తమైన సీఐ రాము నిరంజన్ భార్యకు వచ్చిన ఫోన్ కాల్ లోకేషన్ గుర్తించగా విజయవాడ పరిసర ప్రాంతంలో ఉన్నట్లు తెలిసింది. దీంతో విజయవాడలోని రెండు పోలీసు కంట్రోల్ రూమ్‌లను అప్రమత్తం చేసి వాటి పరిధిలోని పోలీసు స్టేషన్ల ద్వారా యువకుడి ఆచూకీ గురించి వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేశారు. సరిగ్గా గంట వ్యవధిలో మాచవరం కంట్రోల్ రూమ్ ద్వారా యువకుడి ఆచూకీ లభ్యమైంది. పోలీసులు చేరుకుని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అప్పటికే యువకుడు అపస్మారక స్థితికి చేరుకోగా ఏలూరు రోడ్డులోని ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించారు. నిరంజన్ తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు విజయవాడకు బయలుదేరారు. రెండు రోజులాటు ఉత్కంఠ రేపిన యువకుడి అదృశ్య ఘటన సుఖాంతంగా ముగియడం పట్ల నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆత్మకూరు సీఐ రామును అభినందించారు.

# సమస్యల తిష్ట.. తీరేదెట్ట..!

నంద్యాల, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 37, 38వ వార్డుల పరిధిలోని నందమూరి నగర్, ఎస్ఆర్‌బీసీ నగర్, వైఎస్ఆర్ కాలనీల్లో ఏళ్ల తరబడి సమస్యలు తిష్ట వేశాయి. ఆయా కాలనీల్లో ఎక్కడ చూసినా రహదారులు, డ్రైనేజీలు లేకపోవడంతో ఎక్కడికక్కడ మురుగు నీరు రోడ్లపైకి చేరుతోంది. తద్వారా పిచ్చి మొక్కలు సైతం పెరిగి దోమల బెడద ఎక్కువైంది. దీంతో ఒక వైపు దుర్వాసన, మరో వైపు దోమల బెడదతో స్థానిక ప్రజలు జ్వరాల బారిన పడాల్సిన దుస్థితి నెలకుంది. కొన్ని చోట్ల మరీ దారుణం. రోడ్లపైనే నెలల తరబడి మురుగు నీరు ఉండటం మరింత ఇబ్బందికరంగా మారింది. కొన్ని రోడ్లయితే గుంతలమయంగా మారాయి. వర్షం వస్తే అంతే సంగతులు. వీటికి తోడు నంద్యాల నగరం నుంచి ఆయా కాలనీలకు వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు.. గుంతలుగా ఉండటంతో సదరు రహదారి గుండా రాకపోకలు సాగించాలంటే నరకం కనబడుతోందని బాధిత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఆయా కాలనీల సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం

- మురికి కూపాలుగా కాలనీలు
- అధ్వానంగా రోడ్లు, డ్రైనేజీలు
- పిచ్చి మొక్కలతో దోమల బెడద
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- కూటమి ప్రభుత్వమైనా స్పందించేనా..?



37వ వార్డులో వైఎస్ఆర్ నగర్‌లో డ్రైనేజీలు లేక రోడ్డుపైనే మురుగు నీరు





● నంద్యాల మున్సిపాలిటీలోని 37, 38 వార్డుల పరిస్థితి ఇలా...

| | |
|---|---|
| కుటుంబాలు | : 4267 |
| జనాభా సంఖ్య | : 22,645 |

కాలనీలు: 3 (నందమూరినగర్, ఎస్ఆర్‌బీసీ, వైఎస్ఆర్ కాలనీలు)

## ఏళ్ల తరబడి సమస్యలు..

నందమూరి నగర్, వైఎస్ఆర్ కాలనీ, ఎస్ఆర్‌బీసీ కాలనీలు ఏర్పడి సుమారు 30 ఏళ్లు అవుతోంది. ప్రధానంగా రోడ్లు, డ్రైనైజీలు లేకపోవడం ఆయా కాలనీల ప్రజలకు ప్రధాన సమస్యగా మారింది. అక్కడక్కడా తాగునీటి, విద్యుత్ సమస్యలు కూడా వేధిస్తున్నాయి. నంద్యాల నగరం నుంచి నందమూరినగర్, వైఎస్ఆర్ కాలనీ, ఎస్ఆర్‌బీసీ కాలనీలతో పాటు గడివేముల మండలంతో మరిన్ని గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై సైతం నెలల తరబడి రెండు ప్రాంతాల్లో గుంతలు ఏర్పాడ్డాయి. నిత్యం ఈ రోడ్డు గుండా వేల వాహనాలు వెళ్తుంటాయి. వర్షం వస్తే గుంతల్లో నీళ్లు నిలబడి ప్రమాదాలకు గురైన సందర్భాలు లేకపోలేదు. కనీసం సంబంధిత అధికారులు సదరు రోడ్డుకు కూడా తాత్కాలిక మరమ్మతులు చేయక పోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

## కూటమి ప్రభుత్వమైనా స్పందించేనా..?

ఆయా కాలనీలు ఏర్పడి సుమారు 30 ఏళ్లు గడిచినా ఏమాత్రం సదరు కాలనీలు అభివృద్ధికి నోచుకోలేదు. సమస్యలు పరిష్కరించాలని కాలనీ ప్రజలు పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వాలు మారిన ప్రతిసారి పాలకులు, అధికారులు అడపాదడప పనులు చేసి చేతులు దులుపు కున్నారనే విమర్శలు లేకపోలేదు. మొత్తంగా పాలకులు, ఆయా అధికారుల నిర్లక్ష్యం ఆయా కాలనీల అభివృద్ధిపై పడింది. తద్వారా ఎక్కడికక్కడ ఆయా కాలనీల్లో పలు అభివృద్ధి పనులు ఆగిపోయాయి. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వమైనా స్పందించి ఆయా కాలనీలకు తగిన నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## మురుగు నీటితో దోమల బెడద..



మా కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడంతో రోడ్లపైకి మురుగునీరు చేరుతోంది. దీంతో దోమల బెడద ఎక్కువగా ఉంది. చాలా మంది జ్వరాల బారిన పడ్డారు. ఖాళీ ప్లాట్ల వాళ్లు ఇల్లు నిర్మించుకోకుండా వదిలేశారు. దీంతో పిచ్చిమొక్కలతోపాటు చెత్తాచెదారం కూడా పేరుకుపోయింది. ఇళ్ల ముందు దుర్వాసన వస్తోంది. ఇంట్లో నుంచి బయటకు రావాలన్నా ఇబ్బందిగానే ఉంది. వర్షం పడిన సమయంలో మరింత ఇబ్బందిగా ఉంటోంది.

- బేబీ, వైఎస్ఆర్ కాలనీ

## రాత్రి పూట బయటకు రావాలంటే భయంగా ఉంది



కాలనీ ఏర్పడినప్పటి నుంచి ఇక్కడే ఉన్నాం. రోడ్డు డ్రైనేజీ లేకపోవడంతో ఎక్కడికక్కడ మురుగు నిల్వ నిలబడుతోంది. దోమలు ఎక్కువగా ఉన్నాయి. రాత్రి పూట బయటకు రావాలంటే భయంగా ఉంది. ఈ రోడ్డు గుండానే కస్తూర్బా స్కూల్‌కు వెళ్లాలంటే విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. త్వరగా రోడ్డు, డ్రైనేజీ వేయాలని కోరుతున్నాం.

- అమీరూన్ ( నందమూరినగర్)

## చాలా సార్లు అడిగాం



కాలనీలో రోడ్డు, డ్రైనేజీలు నిర్మించాలని గతంలో చాలా సార్లు అడిగాం. కానీ ఎవరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా అడిగాం. త్వరలో వేస్తామని చెప్పారు. రోడ్లు, డ్రైనేజీలు లేక కాలనీలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నగరంలో నుంచి నందమూరి నగర్, వైఎస్ఆర్ కాలనీ, ఎస్ఆర్‌బీసీ కాలనీలకు వచ్చే ప్రధాన రహదారి కూడా గుంతలమయంగా మారింది. కనీసం గుంతలైనా పూడ్చి ఇబ్బంది లేకుండా చూడాలి.

- యూన్సీ, నందమూరి నగర్



మట్టిరోడ్డు దిక్కు..



నంద్యాల నగరం నుంచి ఆయా కాలనీలకు వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి



37వ వార్డులో డ్రైనేజీ లేకుండా వేసిన సీసీ రోడ్డు

## ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



రబ్బాని కాంప్లెక్స్ వద్ద కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

నందికొట్కూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య జన్మదిన వేడుకలను టీడీపీన నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం రబ్బాని కాంప్లెక్స్ వద్ద కౌన్సిలర్ జాకీర్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చిన్నరాజు, టీడీపీ నాయకులు లాయర్ జాకీర్, జమీల్, రమేష్, సురేంద్ర, రిటైర్డ్ ఎస్.ఐ. జాన్, డా.వనజ, మీనాక్షి పాల్గొన్నారు.

● టీడీపీ కార్యాలయంలో టీడీపీ పట్టణాధ్యక్షులు, కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి కేక్ కట్ చేసి పట్టణాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డికి తినిపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ క్లస్టర్ ఇన్‌చార్జి ముర్తుజావళి, ముస్లింమైనార్టీ రాష్ట్ర అధికారప్రతినిధి షకీల్ అహ్మద్, టీడీపీ నాయకులు గిరికుమార్, మల్లికార్జునరెడ్డి, సౌదీ చాంద్, మోహన్, వడ్డె శ్రీను, కళాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి



ర్యాలీ చేస్తున్న సీఐటీయూ నాయకులు

నందికొట్కూరు, జనవరి 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని వ్యాకాస జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు, రైతు సంఘం జిల్లా నాయకులు బెస్తరాజు, సీఐటీయూ జిల్లా నాయకులు గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం నందికొట్కూరు పట్టణంలో రైతు ఆర్మిక ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక కొత్త బస్టాండ్ నుంచి కేజీ రోడ్డు మీదుగా మిడ్తూరు రోడ్డు, బైపాస్ రోడ్డు, పగిడ్యాల రోడ్డు మీదుగా పటేల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వ్యాకాస జిల్లా సహాయ కార్యదర్శి పక్కీర్ సాహెబ్, ప్రజాసంఘాల నాయకులు కర్ణ, ఓబులేసు, శ్రీనివాసులు, బాబు, హర్షవర్ధన్, ఏసన్న, హుస్సేన్, కృష్ణ, పాండు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కొలనుభారతిలో భక్తజన సందడి

కొత్తపల్లి జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని చదువుల సన్నిధి అయిన కొలనుభారతి పుణ్యక్షేత్రానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఉద్యోగస్థులు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరావడంతో క్షేత్రంలో సందడి నెలకొంది. అమ్మవారికి పురోహితులు కుంకుమార్చన, పుష్పార్చన, సహస్రనామార్చన,సప్తశివాలయాల్లో శివునికి అభిషేకాదిక్రతువులు నిర్వహించారు.

# ఘనంగా గణతంత్ర వేడుకలు

జిల్లాలో గణతంత్ర వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు వివిధ పార్టీల కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. పాఠశాలల విద్యార్థుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళి అర్పించారు. అనంతరం జాతీయ జెండా ఎగురవేసి మిఠాయిలు పంచారు.



కురుకుంద లో జెండా ఎగురవేస్తున్న వీఆర్ఎస్పీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి



ఆత్మకూరు డీఎస్పీ కార్యాలయంలో జెండా ఎగుర వేస్తున్న డీఎస్పీ రామాంజీనాయక్



గడివేములలో రాజరాజేశ్వరి హైస్కూల్ విద్యార్థుల విన్యాసాలు



వెలుగోడు తహసీల్దార్ కార్యాలయంలో...



కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో..



పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయంలో..



మెరిట్ విద్యార్థులతో కళాశాల చైర్మన్ డాక్టర్ శాంతిరాముడు



నెహ్రూనగర్ ఎంపీపీ పాఠశాలలో ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ



వెలుగోడులో...



బీజేపీ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు



జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



మహానంది ప్రభుత్వ గిరిజన పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్లు అందజేస్తున్న ఎస్ఐ



గోస్పాడులో...



గడివేములలో...



పాములపాడులో విద్యార్థుల విన్యాసం



నందికొట్కూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద...



ఆత్మకూరు టీడీపీ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న సీనియర్ నాయకుడు శివరామిరెడ్డి



బండిఆత్మకూరులో తహసీల్దార్ కార్యాలయం వద్ద..



జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం వద్ద..



నందికొట్కూరు మున్సిపాలిటీ కార్యాలయం వద్ద...



నందికొట్కూరు: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆట వస్తువులను అందిస్తున్న శ్రీలక్ష్మి ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ అధినేత

## అహోబిల లక్ష్మీ నరసింహ స్వామికి పూజలు



చెన్నకేశవ ఆలయంలో నరసింహ స్వామి మాలధారుల పూజలు

**చాగలమర్రి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** చాగలమర్రి చెన్నకేశవ ఆలయంలో అహోబిల లక్ష్మీనరసింహస్వామి దీక్ష చేపట్టిన మాలధారులు ఆదివారం నరసింహస్వామి, చెన్నకేశవ ఉత్సవమూర్తు లకు విశేష పూజలు చేశారు. గురుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కమిటీ అధ్యక్షుడు గుత్తి నరసింహులు ప్రారంభించారు. పాత శివాలయంలో ఈశ్వరస్వామికి శివమాల భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

## కార్మికుల హక్కులను హరిస్తే సహించేది లేదు



ఆళ్లగడ్డలో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

**ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 26(ఆంధ్రజ్యోతి) :** కార్మికుల హక్కులను హరిస్తే సహించేది లేదని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తాళ్ల శ్రీనివాసులు, ఆళ్లగడ్డ పట్టణ కార్యదర్శి తాళ్ల రమేష్ బాబు హెచ్చరించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ, కార్మిక వ్యతిరేఖ విధానాలను నిరసిస్తూ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ఆదివారం బైక్, ట్రాక్టర్ ర్యాలీ నిర్వ హించారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని అడు గుతున్న రైతులపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు తరలించడం హేయనీయమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకట య్య, సాల్మన్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, రమేష్, కార్మిక, రైతు సోదరులు పాల్గొన్నారు.

**కొలిమిగుండ్ల:** కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దావీదు విమర్శించారు. ఆదివారం కొలిమిగుండ్లలో ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక అల్లాడుతుంటే ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ప్రభుత్వాలు వెంటనే రైతుల పంటలకు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు.

**డోన్ రూరల్:** కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి మోటరాముడు, నియోజకవర్గ కార్యదర్శి అబ్బాస్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్య దర్శి జులేఖ ఆరోపించారు. ఆదివారం నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయుసీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**బేతంచెర్ల :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మార్చే విధానాన్ని వ్యతిరేకించాలని దేశ వ్యాప్త పిలుపులో భాగంగా సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఏపీ రైతు సంఘాల ఆధ్వర్యంలో బేతంచెర్లలో బైక్ ర్యాలీని ఆదివారం నిర్వహించారు. కా ర్యక్రమంలో సీపీఎం పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, రైతు సం ఘం జిల్లా అధ్యక్షులు వి.సుబ్బరాయుడు, మండల కార్యదర్శి మధు శేఖ ర్, నాయకులు రామ్మోహన్, కిష్టన్న, జే.శ్రీనివాసులు, మద్దిలేటి స్వా మి మల్లికార్జున, హరిప్రసాద్ శెట్టి, ఎస్కే భాషా, వెంకటరమణ, సుబ్బ డు, కృష్ణ, రాము, రాజబాబు, నరసింహులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ లేఔట్‌లో చెత్తా చెదారం



చాగలమర్రిలోని ఎన్టీఆర్ లేఔట్‌లలో చెత్తాచెదారం

**చాగలమర్రి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** చాగలమర్రి గ్రామంలోని గుంతపాలెం రహదారి సమీపంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ లేఔట్‌లలో ఆదివారం పొగ కప్పేసింది. గ్రామంలోని చెత్తా చెదారాన్ని ట్రాక్టర్లతో లే ఔట్‌లలో రహదారి పక్కన తోలి వదిలేశారు. ఈ చెత్తకు నిప్పంటించడంతో పక్కా గృహాలంతా పొగతో నిండుకుంది. గాలి వీచడంతో దుమ్ము ధూళితో పాటు పొగ చుట్టుకొని వాహనదారులు, ల బ్ధిదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఎన్టీఆర్ లేఔట్‌లలో నిర్మించుకు న్న గృహాల మధ్యన చెత్తా చెదారం తోలడం ఏమిటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. గృహాల వద్దకు వెళ్లేందుకు కూడా వీలు లేకుండా రహ దారుల వెంట చెత్తాచెదారం పడేయడంతో వారు ఆగ్రహం వ్యక్తం చే స్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి చెత్తా చెదారం గృహాల మధ్యలో వేయకుండా డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని లబ్ధిదారు లు కోరుతున్నారు.

## పొలాలే బార్లు .. రహదారులే రెస్టారెంట్లు

### - అన్నదాతలకు తీవ్ర కష్టాలు తెచ్చి పెడుతున్న మందుబాబులు



పొలంలో పడేసిన మద్యం సీసాలు

**కొలిమిగుండ్ల, జనవరి 26 (ఆంధ్ర జ్యోతి) :** మందు బాబులు రెచ్చిపోతున్నారు. ఇష్టానుసారంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ ప్రజలకు, రైతులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. పొలాలను బార్లుగా మార్చుకొని .. రహదారులను రెస్టారెంట్లుగా చేసుకొని మరీ రెచ్చిపోతున్నారు. దీంతో ఇటు వాహనదారులు, అటు రైతులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. మీర్జాపురం రహదారి, బెలుం రహదారి, అంకిరెడ్డిపల్లె నుండి చింతలాయపల్లెకు వెళ్లే రహదారి పేట్నీకోట గ్రామాలకు వెళ్లే రహదారుల్లో మందు బాబుల తాకిడి అధికంగా ఉంది. మీర్జాపురం రహదారిలో పొలాలను ఆసరాగా చేసుకొని మందుబాబులు ఇష్టానురీతిగా ప్రవర్తిస్తున్నారు. మద్యం మత్తులో పొలంలోనే మందు సీసాలను సైతం పగులగొడుతున్నారు. దీంతో రైతులు పొలాల్లో పనులు చేసుకునే సమయంలో గాజు పెంకులు తగిలి గాయపడిన సంఘటలు చోటు చేసుకుంటున్నారు. పొలాల్లో ఎక్కడ చూసినా మద్యంసీసాలు, సారా ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు దర్శనమిస్తున్నా యంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది. ప్రధాన రహదారుల పక్కన ఉన్న పొలాలు బార్లను తలపిస్తున్నాయని, మద్యం తాగి తమనే హెచ్చరిస్తున్నారని రైతులు వాపోతున్నారు. మందు బాబుల ఆగడాలపై పోలీసులు దృష్టిసారించాలని కోరుతున్నారు.





కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో..



ప్యాపిలిలో..



డోన్‌లో ఎంఎస్ఆర్ కార్యాలయం వద్ద ..



బనగానపల్లె సివిల్ న్యాయాధికారి కోర్టులో..



చాగలమర్రి పెన్షనర్ల సంఘం వద్ద



ఉయ్యాలవాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద..



రుద్రవరంలో..



ఇల్లూరుకొత్తపేట ఉన్నత పాఠశాలలో జాతీయ జెండా ఎగురవేస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి



కొలిమిగుండ్లలో ప్రదర్శన చేపడుతున్న రామక్రిష్ణ స్కూల్ విద్యార్థులు



శిరివెళ్ల మండలం యర్రగుంట్లలో ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ



ఉప్పలపాడు ఆసుపత్రి వద్ద జెండా ఎగురవేస్తున్న డాక్టర్ యమున

# ఘనంగా గణతంత్ర వేడుకలు

**బనగానపల్లె, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):** మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలని బనగానపల్లె పట్టణ మాజీ సరంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. ఆదివారం 76వ గణతంత్రవేడుకల సందర్భంగా ఇల్లూరుకొత్తపేట జడ్పీ ఉన్నతపాఠశాలలో బీసీ రాజారెడ్డి మువ్వన్నెల జెండా ఎగురవేసి జెండా వందనం చేశారు. భరతమాత చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమం లో హెచ్ఎం సోమశేఖర్‌రెడ్డి, మిట్టపల్లె సర్పంచ్ తులసిరెడ్డి, ఇల్లూరుకొత్తపేట సర్పంచ్ రమణ, మాజీ సర్పంచ్ రామిరెడ్డి, ఎంపీటీసీ బాలనాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే బనగానపల్లె మెజిస్ట్రేట్ కోర్టులో జూనియర్ సివిల్ న్యాయాధి కారి షేక్ అబ్దుల్ రహిమాన్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దారు నారాయణరెడ్డి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మానసవీణ, వైస్ ఎంపీపీ లక్ష్మీదేవి, ఎంపీడీవో రమణ, సర్కిల్ కార్యాలయంలో సీఐ మంజునాథరెడ్డి, ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ దుగ్గిరెడ్డి, నందివర్గం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ వెంకటసు బ్బయ్య జాతీయజెండాను ఎగురవేశారు.

**కోవెలకుంట్ల :** మండలంలో, పట్టణంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో మేజరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈవోఆర్‌డీ ప్రకాశ్‌నాయుడు జాతీయ జెండా ఎగురవేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రహ్మణ్యం ది కోఆపరేటివ్ బ్యాంకు కింద ఉన్న స్వగృహంలో జాతీయ జెండా ఎగురవేశారు.

**ప్యాపిలి:** మండలంలో ఎంపీడీవో, రెవెన్యూ, పోలీస్ స్టేషన్, గ్రామపంచాయతీ కార్యాలయాతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గణతంత్ర వేడుకలను నిర్వహించారు. కార్యక్రమాల్లో సీఐ వెంకటరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోఆర్డీ బాలక్రిష్ణుడు, బోరెడ్డి శ్రీరామిరెడ్డి, శ్రీనివాసులు, శివకుమార్ పాల్గొన్నారు.

**చాగలమర్రి:** మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాల్లో జాతీయ పతకాలను ఎగురవేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

**రుద్రవరం:** మండలంలో తహసీల్దారు కార్యాయలంలో తహసీల్దారు మల్లిఖార్జున, ఫారెస్టులో సబ్ డీఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి, మండల పరిషత్‌లో ఎంపీపీ బాలస్వామి, విద్యాశాఖలో ఎంఈవో వీర రాఘవయ్య, పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ వరప్రసాద్ జెండా ఎగురవేశారు.

**కొలిమిగుండ్ల :** మండలంలోని పోలీస్ స్టేషన్‌లో సీఐ రమేష్‌బాబు జెండా ఆవిష్కరించగా, ఎంపీడీవో కార్యాలయంలో ఈవోఆర్డీ శివప్రసాద్, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జాతీయ జెండాను ఎగురవేశారు. మరోవైపు రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు జాతీయ జెండా ఆవిష్కరించారు.

**శిరివెళ్ల :** మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పుష్పకుమారి, మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప, పోలీస్ స్టేషన్‌లో సీఐ వంశీధర్, డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపా ల్ ఇంద్రావతి ఆదివారం జాతీయ జెండాను ఆవిష్క రించారు.

**అవుకు :** అవుకు రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో వెంగన్న, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ రాజారెడ్డి, సామాజిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అభినయ్, ఉప్పలపాడు ప్రాథమికి ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ యమున, అవుకు మేజర్ పంచాయత కార్యాలయంలో ఉపసర్పంచ్ చల్లా రఘునాథరెడ్డి, పశువైద్యశాల కార్యాలయం వద్ద డాక్టర్ భారతీదేవి జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం చేశారు.

**ఆళ్లగడ్డ(శిరివెళ్ల) :** పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ జాతీయ జెండా ఆవిష్కరణలో వేడుకల్లో పాల్గొన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ చిరంజీవి, ఎస్ఐ నగీనా జెండా వందనం చేశారు. పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ప్రైవేట్ పాఠశాలల నియోజకవర్గ అధ్యక్షుడు అమీర్ బాషా, కేవీ సుబ్బారెడ్డి పాఠశాల కరస్పాండెంట్ ఓబన్న పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

**దొర్నిపాడు:** మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కార్యాలయాల్లో మువ్వన్నెలా జెండాను ఎగుర వేశారు. తహసీల్దార్ సుభద్ర, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సావిత్రి, జడ్పీహెచ్ పాఠశాలలో హెచ్ఎం శ్రీనివాసరావు, పోలీసు స్టేషన్ ఆవరణలో ఇన్‌చార్జి ఎస్ఐ బీటీ వెంకటేశ్వర్లు జెం డాను ఆవిష్కరించారు. జడ్పీహెచ్ పాఠశాలలో టీడీపీ నాయకులు సిద్ధి సత్యం, జెడ్పీహెచ్ చైర్మన్ నగిరి సుధాకర్, జెడ్పీటీసీ శకుంతలమ్మ, మాజీ సర్పంచ్ సిద్దినారాయణ, పగిడెల బాలిరెడ్డి పావురా లను ఎగురవేసి జాతీయ పతాకానికి సెల్యూట్ చేశారు.

**సంజామల:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం వాడవాడల్లో మువ్వన్నెల జెండా రెపరెప లాడింది. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సా ల్మన్, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అని ల్ కుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సి పాల్ నాగమ్మ, ఉన్నత పాఠశాలలో ఆయా హెచ్.ఎంలు, కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో ప్రిన్సిపాల్ శ్రీలేఖ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ వినోద్ కుమార్, పోలీసు స్టేషన్‌లో ఎస్.ఐ రమణయ్య, గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పి.డి బాషా ఆధ్వర్యంలో విద్యార్థినులను అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

**ఉయ్యాలవాడ:** మండలంలోని తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు శ్రీనివాసులు, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఉమమహేశ్వర రావు, పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ వెంకటేశ్వర్లు, స్థానిక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, మాయలూరు ఉన్నత పాఠశాలలో హెచ్ఎం షరీఫ్ జాతీయ జెండాలను ఎగురువేశారు.

**బేతంచెర్ల :** తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రకాష్‌బాబు, పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్, మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రంలో ఉప కమిషనర్, ఈవో రామాంజనేయులు, పాఠశాలల్లో హెచ్ఎం, ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ మరియదాసు జెండాను ఆవిష్కరించారు.

**డోన్ రూరల్:** పట్టణంలోని టీడీపీ, బీజేపీ కార్యాలయాల వద్ద జాతీయ జెండాను నాయకులు ఎగురవేశారు. అలాగే పట్టణంలోని ఎంఎస్ఆర్ కార్యాలయంలో సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి జెండాను ఆవిష్కరించారు. అలాగే సబ్‌కోర్టు వద్ద సీనియర్ సివిల్ న్యాయాధికారి తంగమణి, డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్డీవో నరసింహులు, ఆర్‌టీవో క్రాంతి కుమార్, తహసీల్దార్ నాగమణి, పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద సీఐ ఇంతియాజ్‌బాషా జెండాను ఎగురవేశారు.



ఆళ్లగడ్డలో జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల విన్యాసం



చాగలమర్రిలో జాతీయ నేతల చిత్రపటాలకు పుష్పమాల



దొర్నిపాడు జడ్పీహెచ్ పాఠశాలలో పావురాలను పైకి ఎగుర వేస్తున్న ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు



ఆళ్లగడ్డలో పట్టణ పోలీస్ స్టేషన్‌లో..

## రహదారి పనులు వేగవంతం చేయండి: మంత్రి బీసీ

**బనగానపల్లె, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):** నేషనల్‌హైవే పనులను వేగవంతం చేయాలని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం నంద్యాల జిల్లాలోని గోస్పాడు మండలం పసురుపాడు గ్రామం వద్ద జాతీయ రహదారి పనులను మంత్రి బీసీ తనిఖీ చేశారు. 544 డీ జాతీయ రహదారుల పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని మంత్రి కోరారు.

**బాలకృష్ణకు పద్మభూషణ్ పురస్కారం రావడం హర్షం**

సినీ నటుడు నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు రావడంపై రోడ్లు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. మంత్రి మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు కుమారుడు హిందూపురం ఎమ్మెల్యే, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ చైర్మన్ బాలకృష్ణకు పద్మభూషణ్ పురస్కారం రావడం తెలుగు జాతికి గర్వకారణం అన్నారు. పద్మ అవార్డులు పొందిన తెలుగు వారందరికీ మంత్రి అభినందనలు తెలియజేశారు.



పసురపాడులో నేషనల్ హైవే రోడ్డు పనులను పరిశీలిస్తున్న రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

## ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు

**రుద్రవరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** పార్వేట పల్లకీలో కొలువుదీరిన జ్వాలా లక్ష్మీనరసింహస్వామి, ప్రహ్లాద వరదస్వాములకు మండలంలో తిమ్మనపల్లెలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నరసాపురం గ్రామంలో ఉత్సవమూర్తుల పల్లకికి స్వాగతం పలికారు. గ్రామానికి పల్లకి చేరుకోవడంతో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడిగా లక్ష్మణ్

**డోన్ రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడిగా వి.లక్ష్మణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవ స్థాపకులు రామానాయుడు ఆధ్వర్యంలో నూతన అధ్యక్షుడిని ప్రక టించారు. కార్యక్రమంలో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఉపాధ్యక్షులు టైలర్‌బాషా, సభ్యులు రాజేష్, గోల్డ్ హరి, తాయన్న, పాల్గొన్నారు.

## అర్చకులకు శిక్షణ

**సంజామల, జనవరి 26(ఆంధ్రజ్యోతి):** హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో అర్చకులకు రెండురోజులపాటు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని ఆల్వకొండ క్రాస్‌రోడ్డు వద్ద వెలిసిన కాశిరెడ్డినాయన ఆశ్రమలో శిక్షణా కార్యక్రమాలు జరుగుతున్నాయి. 86మంది అర్చకులకు శ్రీ వైష్ణవ రామశేషయ్య , దొంతా వెంకటేశ్వర్లు, రాఘవాచార్యులు, మునిస్వామి, అంబటి చంద్రశేఖర్ రెడ్డి, ప్రత్యేక శిక్షణను ఇవ్వడంతోపాటు దేవాలయాల పరిరక్షణ కోసం ప్రతి హిందువు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, సతీష్ కుమార్, శ్రీరాముడు, నాయక్, శివనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

**సంజామల, జనవరి 26(ఆంధ్రజ్యోతి):** చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని ఆర్. లింగందిన్నె గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన మూరబోయిన దేశమ్మ ఈ నెల 13న పాముకాటుకు గురైంది. బాధితురాలిని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది.

## ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు

**కోవెలకుంట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని కోవెలకుంట్ల ఆర్యవైశ్య సంఘం సభ్యులు పెండేకంటి సుబ్రహ్మణ్యం, విజయలక్ష్మి దంపతులు అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రమాదేవి అధ్యక్షతన విద్యార్థులకు నగదు పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెండేకంటి సుబ్రహ్మణ్యం ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

## టీడీపీతోనే బీసీల సంక్షేమం

**చాగలమర్రి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమని బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ తెలిపారు. ఆదివారం బీసీ సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు రామతీర్థం, పీరయ్య, సుబ్బరాయుడు, పుల్లయ్య, వాసు, చిన్ని కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీతారాములకు విశేష పూజలు

**చాగలమర్రి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** చాగలమర్రి గ్రామంలోని కోదండరామ, పట్టాభిరామ, వీరాంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం విశేష పూజలు చేశారు. చాగలమ్మ, గంగమ్మ, పెద్దమ్మ ఆలయాల వద్ద అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు నగదు బహుమతులు

**రుద్రవరం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):** రుద్రవరం కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఆదివారం 2023-24 పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు నగదు బహుమతులు దేవగుడి నజీర్ హుసేన్ అందించారు. పదోతరగతిలో ప్రథమ బహుమతి చరణికి రూ.5వేలు, రెండో బహుమతి రక్షితకు రూ.3వేలు, మూడో బహుమతి లావణ్యకు రూ.2వేలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మంత్రి బీసీ పర్యటన వాయిదా

**కొలిమిగుండ్ల, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) :** మంత్రి బీసీ జనార్దనరెడ్డి కొలిమిగుండ్ల పర్యటన వాయిదా పడినట్లు ఎంపీడీవో ప్రసాదరెడ్డి ఆదివారం వెల్లడించారు. తిరిగి కొలిమిగుండ్లలో ఎప్పుడు పర్యటిస్తారన్నది త్వరలోనే వెల్లడిస్తామని ఆయన తెలిపారు.